విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా

మంగళవారం 29 అక్టోబరు, 2024. 4 పేజీలు

# టపాసుల గోడౌన్‌ను తనిఖీ చేసిన డిఎస్పీ

**విశాలాంధ్ర-బిట్రగుంట:** జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దీపావళి పండుగను దృష్టిలోఉంచుకొని బోగోలు బియం ఆర్ వాటర్ ప్లాంట్ సమీపంలోని సుమంత్ ఫైర్ వర్క్ టపాసుల గోడౌన్‌ను సోమవారం కావలి డిఎస్పీ శ్రీధర్, బిట్రగుంట ఎస్సై భోజ్యా నాయక్‌తో కలిసి తనిఖీలు నిర్వహించారు. గతంలో గోడౌన్‌లో జరిగిన కొన్ని సంఘటనలను దృష్టిలో ఉంచుకొని టపాసుల వ్యాపారులకు తగు సూచనలు ఇచ్చారు. టపాసుల అమ్మకాలు నిర్వహిస్తున్న ప్రాంతాలలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా అవసరమైన జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. అనుమతులు లేకుండా టపాసులు తయారు చేసిన, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పీ హెచ్చరించారు. ఎవరైనా లైసెన్సులు లేకుండా టపాసులు తయారీ, అమ్మకాలు చేస్తున్నట్టయితే స్థానిక పోలీసు అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ నేపథ్యంలో బోగోలు, విశ్వనాథరావుపేట పరిధిలోగల పలు టపాసుల దుకాణాలను వారు తనిఖీచేశారు.

# త్వరలో విమానాశ్రయ ఏర్పాటుకు ప్రయత్నం: మంత్రులు ఆనం, నారాయణ

**విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు :** నెల్లూరుకి విమానాశ్రయం ఎంతో అవసరమని త్వరలోనే విమానాశ్రయ వర్క్‌ను టేకప్ చేయడం జరుగుతుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, దేవదాయ, ధర్మదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా ప్రజలకి శుభవార్త చెప్పారు. నెల్లూరు కలెక్టరేట్‌లో వారు ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్‌లతో కలిసి రివ్వ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు జిల్లాలోని ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న దగదర్తి ఎయిర్ పోర్ట్, రైస్ మిల్లర్లను ఇతర ప్రాంతాలకు మార్చడం వంటి అంశాలను రివ్యూలో చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ మీడియాతో మాట్లాడుతూ నెల్లూరు జిల్లాకి ఎంతో కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న రెండు ముఖ్యమైన అంశాలను చర్చించేందుకే ఈ సమావేశం నిర్వహించామన్నారు. రైస్ మిల్స్ ఎక్కువగా కార్పొరేషన్ ఏరియాలో ఉన్నాయన్నారు. అయితే ఇప్పుడు ఎన్జీటీ చాలా కఠినంగా ఉందని తెలిపారు. రైస్ మిల్స్ ఉన్న ఏరియాల్లో నాలుగు రెట్లు ఎక్కువగా పొల్యూషన్ ఉందన్నారు. ఈ క్రమంలో ఎన్జీటీ నిబంధనల మేరకు ఆ రైస్ మిల్లును ఆ ప్రాంతాల నుంచి మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలోనే ఈ సమస్యపై మూడు అసోసియేషన్లతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అధికారులతో చర్చించడం జరిగిందని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు వారికిఎటువంటి నష్టం జరగకుండా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆయా ప్రాంత ఎమ్మెల్యేలు, కలెక్టర్‌తో చర్చించి ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. కిసాన్ ఎస్ఈ జెడ్, కృష్ణపట్నం పోర్ట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. మిమ్మల్ని ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకోవడం లేదన్నారు. మీరు వ్యాపారాలు చేసుకుంటేనే రాష్ట్రానికి జీఎస్టీ కూడా బాగా వస్తుందన్నారు.వ్యాపారాస్తుల్ని

ప్రోత్సహించడమే ఈ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. అందుకనే రైస్ మిల్లర్ల యజమానులు, అసోసియేషన్ నాయకులు అందరూ ఒక నిర్ణయానికి వచ్చి ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు. ఏ దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ముఖ్యమన్నారు. ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ అంటే రోడ్డు మార్గం, రైలు మార్గం, విమాన మార్గం, ఓడరేవు ఈ నాలుగు చాలా అవసరం అన్నారు. నెల్లూరుకి విమాన మార్గం కావాల్సిన అవసరం చాలా ఉందన్నారు. ఎందుకంటే కృష్ణపట్నం పోర్ట్, ఇంకా మరి కొన్ని పోర్టులు కూడా వచ్చేశాయన్నారు. వాటిలో కార్గో అనేది చాలా ముఖ్యమైందన్నారు. 2014-2019 టీడీపీ ప్రభుత్వంలోనే దీనిని మంజూరు చేయడం జరిగిందని.అయితే గత వైసీపీ ప్రభుత్వం దీనిని నెల్లూరులో కాదు ఇంకో దగ్గర అని కొన్ని కారణాల వల్ల ఆపేశారన్నారు. ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబునాయుడు నెల్లూరుకి వచ్చినప్పుడు మళ్లీ దగదర్తిలోనే విమానాశ్రయం పెడుతామని చెప్పారన్నారు. ఢిల్లీ వెళ్లినప్పుడు ఈ విషయంపై కేంద్ర మంత్రిని కలవడం జరిగిందనిఆయన కూడా మీరు స్థలంని సిద్ధం చేయండి నేను వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేస్తానని చెప్పడం జరిగిందన్నారు. వచ్చే వారంలో దీని కోసం ఓ బృందాన్ని పంపిస్తారన్నారు. వీలైనంత త్వరలోనే నెల్లూరుకి విమానాశ్రయ వర్క్ లను టేకప్ చేయడం జరుగుతుందని. ఆయన జిల్లా ప్రజలకి శుభవార్త చెప్పారు. ఇసుక అక్రమాలపై స్పందించిన మంత్రిఇసుక అక్రమాలు జరుగుతాయన్న ప్రశ్నకు మంత్రి నారాయణ స్పందించారు.గత ప్రభుత్వంలో ధరలు అధికంగా ఉన్నప్పుడు ఏమీ చేయలేదని టీడీపీ ప్రభుత్వంలో ధరలు బాగా తగ్గిపోయాయని అయితే వైసీపీ వాళ్లు ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీకి మంచి పేరు వస్తుందనిదీనిని చూడలేకనే వైసీపీ రాజకీయ ఎత్తుగడల కోసమే ధర్నా చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూనెల్లూరు నగరం చుట్టూ ఉన్న రైస్ మిల్లులను ఇతరప్రాంతాలకుతరలించాలని భావిస్తున్నామని చెప్పారు. ఒకప్పుడు నగర శివార్లలో ఉన్న ఈ మిల్లులు నేడు నగరం విస్తరించడంతో నడిబొడ్డులోకి వచ్చాయన్నారు. కృష్ణ పట్నం పోర్టు లేదా కిసాన్ ఎస్.ఈ.జెడ్ లోకి మార్చాలని భావిస్తున్నట్లు తెలియజేశారు. ఈ మేరకు రైస్ మిల్ అసోసియేషన్లతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. జిల్లాకు ఎంతో అవసరమైన దగదర్తి విమానాశ్రయ పనులు కూడా త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కృష్ణపట్నం, రామయ్య పట్నం పోర్టులు జువ్వల దిన్నె ఫిషింగ్ హార్బర్ లు ఉన్నాయని, వీటికిఅను బంధంగా పరిశ్రమలు రానున్నాయని మంత్రి ఆనం తెలిపారు. వీటికి విమానాశ్రయం ఎంతో అవసరం ఉందన్నారు. విమానాశ్రయానికి 13 వందల 79 ఎకరాలు అవసరమని గుర్తించామని చెప్పారు. కొంత భూమికి పరిహారం ఇచ్చామని, అయితే ఇంకా భూమిని సేకరించాల్సి ఉందన్నారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి రామమోహన్ నాయుడుతో చర్చిస్తామని తెలిపారు. త్వరలోనే ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి ప్రతినిధులు వచ్చి పరిశీలన చేస్తారని మంత్రి ఆనం రామనారాయణ తెలియజేశారు.

### ప్రభుత్వ పరిహారం.. రైతులకు శాపం.!

# రూ 2 కోట్ల విలువ చేసే భూమికి రూ 28 లక్షలు పరిహారం

### భూమి కోల్పోయిన రైతుల ఆవేదన.. న్యాయం చేయాలని సబ్ కలెక్టర్ కు వినతి

**విశాలాంధ్ర-కందుకూరు రూరల్:** జాతీయ రహదారి 167బి విస్తరణలో భాగంగా కందుకూరు- సింగరాయకొండ మధ్యన భూములున్న రైతులకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం ఏ మాత్రం సబబు కాదని దీనిపై పునః పరిశీలన చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ లో సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజను కలిసి రైతులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహిరంగ మార్కెట్ లో రూ2 కోట్ల వరకు ఉన్న భూమికి ప్రభుత్వం మార్కెట్ వాల్యూ ప్రకారం రూ28 లక్షలు ఇస్తామని ప్రకటించడం సరికాదన్నారు. దీనివల్ల ఎంతోమంది రైతులు తీవ్రంగా నష్టపోతారని వారు ఆందోళన చెందారు. కందుకూరు- సింగరాయకొండ మధ్యన గల 167బి జాతీయ రహదారికిరువైపులా ఇంజనీరింగ్, బీఈడీ కళాశాలలు, యూనివర్సిటీ, గ్రానైట్, తదితర పరిశ్రమలతో దిన,దినాభివృద్ధి చెందుతున్న ఈ రహదారిలో రైతులకిచ్చే నష్టపరిహారం రైతులను ఆర్థికంగా దెబ్బతీసేలా ఉందన్నారు. ప్రభుత్వ మార్కెట్ వాల్యూ నష్టపరిహారం బహిరంగ మార్కెట్ వాల్యూ కంటే పది రెట్లు తక్కువగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి కోసం భూసేకరణకు ముందు ఈ భూములలో పలు రకాల పండ్ల తోటలు, ఇతరత్రా పంటలు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నట్లు రైతులు తెలిపారు. రహదారికి ఇరువైపులా భూసేకరణలో ఎంతవరకు రైతులు భూములు కోల్పోతారో నోటీసు కానీ, ఇతరత్రా ఎలాంటి సమాచారం రైతులకు తెలియపరచలేదని చెప్పారు. ఓగూరు గ్రామ సమీపంలోని ఇదే రహదారిలో ఎకరాకు రూ79 లక్షల నష్టపరిహారం రైతులకు ఇచ్చినట్లు వారు గుర్తు చేశారు. భూమి కోల్పోయిన రైతుల ఆవేదనను పరిగణలోకి తీసుకొని రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు సబ్ కలెక్టర్ కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. స్పందించిన సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ రైతుల విజ్ఞప్తిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఇదే సమస్యను కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుకు రైతులు విన్నవించగా ప్రకాశం జిల్లా కలెక్టర్ ను కలిసే పని తనకు ఉందని, మీ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా న్యాయం చేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు హామీ ఇచ్చినట్లు బాధిత గ్రామాల రైతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరు, ఓగూరు, పలుకూరు, కనుమళ్ల, తదితర గ్రామాలకు చెందిన రైతులు చేబ్రోలు శ్రీనివాసరావు, కె కృష్ణారెడ్డి, ఎస్ వి శ్రావణ సురేఖ, దాచర్ల మల్లికార్జున, కె వరదారెడ్డి, చేబ్రోలు చిన్నమ్మాయి, చేబ్రోలు కోటేశ్వరమ్మ, గంగవరపు వెంకటేశ్వర్లు, కె మల్లికార్జున, సూరం బ్రహ్మయ్య, డి సుబ్బారావు, సుశీల పాల్గొన్నారు.

# పరిష్కార వేదికకు వినతుల వెల్లువ

**విశాలాంధ్ర-అనంతసాగరం :** సోమవారం ఉదయం అనంతసాగరం మండల కాంప్లెక్స్ కార్యాలయంలో ప్రత్యేక ప్రజా విజ్ఞాపనల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సూపర్ సిక్స్ హామీల అమలే ప్రధాన లక్ష్యంగా ఎన్నికల్లో తమ పార్టీ విజయానికి కారణమైన సూపర్‌సిక్స్ హామీల అమలుకు తమ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు కట్టుబడి వున్నారని, దీపావళి నుంచి ఆడపడుచులకు మహాశక్తి స్కీమ్ ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి చెప్పారు. ప్రణాళికాబద్దంగా ఒక్కొక్క హామీని నెరవేరుస్తూ సూపర్ సిక్స్‌ను పూర్తి చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు.

### ప్రత్యేక విజ్ఞాపనల పరిష్కార వేదికకు 1246 అర్జీలు

అనంతసాగరం ప్రత్యేక ప్రజా విజ్ఞాపనల పరిష్కార వేదిక కార్యక్రమానికి పలు సమస్యలపై 1246 అర్జీలు అందినట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. ప్రధానంగా రెవెన్యూ సమస్యలపై 662 అర్జీలు అందాయని, వీటిలో ఎక్కువ భూముల రీసర్వే కు సంబంధించి వున్నట్లు జేసి చెప్పారు. గృహ నిర్మాణ శాఖకు సంబంధించి 108, పంచాయతీరాజ్ కు 80, సెర్ఫ్ కు 62, సివిల్ సప్లయిస్ కు 39, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖకు సంబంధించి 46, విద్యుత్ శాఖకు 32, ఇరిగేషన్ 20, దేవదాయశాఖ సంబంధించి 16 అర్జీలు అందినట్లు జెసి చెప్పారు. ప్రజలు కూడా సమస్యల పరిష్కారానికి జిల్లా కేంద్రానికి రాకుండా మండల స్థాయిలోనే అర్జీలను పరిష్కరించుకోవాలని జేసి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో పావని, ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్, తహసిల్దార్ సుధీర్, జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు బొల్లినేని గిరినాయుడు, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, సునీత, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కంటైనర్ పోర్టు తమ లక్ష్యం: సోమిరెడ్డి

విశాలాంధ్ర-ముత్తుకూరు: కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ వ్యాపారాన్ని తిరిగి పునరుద్ధరించేందుకు అఖిలపక్షంతో కలిసి పోరాటాలు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం కృష్ణపట్నం పోర్టు సిఇఓ జగదీష్ పటేల్‌ను కలిసి ఈ ప్రాంత రైతుల, భూములు కోల్పోయిన, ఉపాధి కోల్పోయిన వారి కోసం చర్చించేందుకై సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కృష్ణపట్నం పోర్టుకు టిడిపి, సిపిఐ, సిపిఎం, బిజెపి, జనసేన, కాంగ్రెస్ పార్టీలతో కలిసి కృష్ణపట్నం పోర్టుకు వెళ్లేందుకు గోపాలపురం వద్దకు చేరుకున్నారు. అక్కడ అఖిలపక్షం సభ్యులతో సమావేశం నిర్వహించి పోర్టు సీఈఓ తో ఏమి మాట్లాడాలో అన్న విషయాలను చర్చించుకున్నారు. శ్రీ సిటీ 2,600 ఎకరాలు, కృష్ణపట్నం ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అని ఇది కృష్ణపట్నం పోర్టును అనుసంధానంగా ఏర్పాటు చేసిందన్న విషయం తెలిసిందే అన్నారు. గంగవరం పోర్టు ఆదాని చేతిలో ఉందన్నారు. సెప్టెంబర్ 4వ తేదీన కంటైనర్ టెర్మినల్ వ్యాపారాన్ని మొదలు పెట్టడం జరిగిందన్నారు. అయితే కృష్ణపట్నం పోర్టులో మాత్రం కంటిన్యూ టెక్స్లా వ్యాపారాలు మూసివేశారన్నారు. ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ మొదటి ఫేసులో 4, రెండవ పేస్ లో మూడు బెర్తులు కంటైనర్ పోర్టుకు వాడాల్సి ఉందన్నారు. పర్యావరణ అనుమతులను కూడా లెక్కపెట్టకుండా ఆదాన్ని చేయడం విచారకరమన్నారు. అనంతరం సిపిఎం, జనసేన, బిజెపి నాయకులు మోహన్ రావు, కర్నాటి ఆంజనేయులు, బొబ్బేపల్లి సురేష్ నాయుడు మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టులో గెలవగానే బూడిద దిబ్బలు, బొగ్గు గుట్టలు తప్ప ఇంకేమీ కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ వ్యాపారం తనకు పూర్తిగా తెలుసునని తనకు 20 రోజులు సమయం ఇవ్వాలని దీనిపై యాజమాన్యంతో చర్చిస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు పల్లం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, నీలం మల్లికార్జున యాదవ్, నాయకులు ఏ కొ ట ు రామయ్య, ఈదురు రామ్మోహన్ రెడ్డి, మునుకూరు రవికుమార్ రెడ్డి, దువ్వూరు రవికుమార్ రెడ్డి, పడాల సర్వారెడ్డి, నాగార్జున, పల్లికొండ సీనయ్య, కావలి విజయ్ కుమార్, శోభన్, శంకర్, బులిగర్ల శీను, కొత్తపల్లి రమేష్, .షఫీ ఉల్లా, సతీష్ నాయుడు, మామిడాల సీనయ్య, రాగాల, విక్రమ్ రెడ్డి, పేర్నాటి రామ్మోహన్ రెడ్డి, దువ్వూరు గోపాల్ రెడ్డి, సిపిఐ మండల నాయకులు తుంగ ఏడుకొండలు, వెంకట రమణయ్య, సిపిఎం నాయకులు ఎం మోహన్ రావు, బిజెపి నాయకులు ఆంజనేయులు రెడ్డి, కాకుటూరు రవీందర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, సంపత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దాసరి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## బోగోలులో ఆయుర్వేద జీవన విజ్ఞానవేదిక

విశాలాంధ్ర-బిట్రగుంట: బోగోలు మేజర్ పంచాయతీ శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో సోమవారం శ్రీ దశ ఆయుర్వేద పీఠం, ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్, బోగోలు శాఖ ఆధ్వర్యంలో ఆయుర్వేదజీవన విజ్ఞాన వేదిక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతపుత్ర చైర్మన్ డాక్టర్ కూరపాటి శాంసన్ మన ఇంటి పరిసరాలలో లభించే ఆయుర్వేద మొక్కలు, మూలికలు, వంట దినుసులలో లభించే అమోఘమైన ఆయుర్వేద చిట్కాలను వివరించారు. ప్రకృతి మనకు దేవుడు ప్రసాదించిన ఆయుర్వేదఘని అన్నారు. వివిధ ఆరోగ్య సమస్యలపై అక్కడికి వచ్చిన పలువురికి వైద్యసేవలు అందించారు. పై కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ నిర్వాహకులు సునీల్, రవిచంద్ర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణం పరిశీలించిన వ్యవసాయ అధికారి

విశాలాంధ్ర- మనుబోలు: మనుబోలు మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిరా సీడ్స్ విత్తనాల దుకాణాన్ని సోమవారం వ్యవసాయ అధికారి జహీర్ భాష తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాణ్యమైన విత్తనాలను బిల్లుతో పాటు రైతులకు అందజేయాలని సూచించారు. రైతులు ఎక్కడైనా విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు బిల్లుతోపాటు మొలక శాతం పరీక్షించి సంతృప్తి చెందిన తర్వాత నారు పోసుకోవాలని అన్నారు. మనుబోలు రైతు భరోసా ఒకటి లో 125 రూపాయలు సబ్సిడీతో విత్తనాలు జరుగుతుందని, ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## టపాసులు గోడౌన్‌ను తనిఖీ చేసిన రూరల్ సీఐ

విశాలాంధ్ర- కావలి: కావలి మండలం కొత్తపల్లి గ్రామంలో ఉన్న టపాసుల గోడౌన్ ను సోమవారం కావలి రూరల్ ఇన్స్పెక్టర్ జి.రాజేశ్వర రావు తనిఖీ చేశారు. ఆ గ్రామంలో ఉన్న భాషా గోడౌన్ లో ఉన్న టపాసులు ఉంచుకొనుటకు ఎదైనా ప్రమాదం జరిగినట్లు అయితే ఏ విధమైన ముందు జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ముందు జాగ్రత్తలు చర్యలు గురించి లైసెన్స్ దారుడికి తగుచూచనలు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా కావలి రూరల్ మండలములో ఎవరైనా ప్రభుత్వ ఉత్తర్వులు, అనుమతులు తీసుకోకుండా టపాసులు అమ్మటము, దగ్గర ఉంచుకోవటం నిషేధము. అట్లు ఎవరైనా టపాసులు లైసెన్స్ లేకుండా తీసుకొని వచ్చి టపాసులు అమ్మినచో వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ రాజేశ్వరరావు తెలిపారు.

## ఘనంగా ముగిసిన శ్రీ ముందర పొట్టెమ్మ తల్లి తిరునాళ్లు

విశాలాంధ్ర- కావలి రూరల్: కావలి మండలం అన్నగారి పాలెం పంచాయితీలో కొలువుదీరిన అమ్మల గన్న అమ్మ శ్రీ ముందర పొట్టెమ్మ తల్లి, గంగమ్మ తల్లి తిరునాళ్లు అంగరంగ వైభవంగా జరిగాయి. మూడు రోజులపాటు జరిగిన ఈ తిరునాళ్ళు ఆలయ కమిటీ నిర్వాహకులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 18 గ్రామాల ప్రజలు తమ ఇంటి ఇలవేల్పైన శ్రీ ముందర పొట్టెమ్మ తల్లి, గంగమ్మ తల్లి ఉత్సవాలకు వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారి దర్శనాన్ని చేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చివర రోజు వేలాదిమంది భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కిటకిటలాడింది. ఉత్సవాలను విజయవంతంగా ముగించి ముందర పొట్టెమ్మ తల్లి, గంగమ్మ తల్లి నిండైన ఆశీస్సులు ప్రజలందరికీ అందేలా భక్తిశ్రద్ధలతో కార్యనిర్వాహన చేసిన ఆలయ కమిటీ సభ్యులకు ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కొండాపురంలో ఓపెన్ హౌస్

విశాలాంధ్ర - కొండాపురం:: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ నందు సోమవారం ఓపెన్ హౌస్ - ఆయుధాల ప్రదర్శన నిర్వహించారు. ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్టేషన్ పరిసరాల్లో ఉన్న క్రైమ్ రికార్డులు, వివిహెచ్ సెట్, ఆయుధాలు, లాకప్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## గ్యాస్ సబ్సిడీలను బ్యాంకులలో జమచేయవద్దు

### దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి

విశాలాంధ్ర - కావలి : గ్యాస్ సబ్సిడీలను బ్యాంకులలో జమచేయవద్దు అని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి పేర్కొన్నారు. సోమవారం ఆర్డిఓ కార్యాలయంలో గ్రీవెన్స్‌డే సందర్భంగా ఆర్డిఓకి వినతిపత్రం ఇచ్చి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి మాట్లాడుతూ దీపావళి పండుగ నుండి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు తెల్లరేషన్ కార్డుదారులకు ఉచితంగా ఇవ్వడం మంచిదే అయినప్పటికి దానికి వచ్చే సబ్సిడీ బ్యాంకులలో జమచేయడం వలన పేదవారు ఆ బ్యాంక్ ట్రాన్సెక్షన్స్ లేకపోవడం, మినిమమ్ బ్యాలెన్స్ లేక పోవడం బ్యాంక్ వ్యవహారాలలో లావాదేవీలు జరపక పోవడం వలన వివిధ కారణాల వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సబ్సిడీ డబ్బులను సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరి వెంకటేశ్వర్లు, పి శ్రీనివాసులు, మోహన్‌రావు, అంచిపాక వేణు, చెరుకూరి జనార్దన్, అనేక మంది పాల్గొన్నారు.

## విత్తనాల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు

విశాలాంధ్ర- కందుకూరు రూరల్: కందుకూరు పట్టణ పరిధిలోని వివిధ ప్రైవేట్ విత్తనాల డీలర్ల షాపులను మండల వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో కందుకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు(ఎ డి ఎ)టి అనసూయ తనిఖీలు నిర్వహించారు, ఎ డి ఎ మాట్లాడుతూ డీలర్లు తప్పనిసరిగా విత్తన నిల్వ పట్టిక (స్టాక్ బోర్డు) లో పంట పేరు,రకం,స్టాక్ నిల్వ మోతాదు, ధర పొందు పరచాలని,ధృవీకరించిన విత్తన కంపెనీల నుండి మాత్రమే కొనుగోలు చేసుకోవాలని సూచించారు, వచ్చిన స్టాకు ను ఎప్పటికప్పుడు స్టాకు రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతులకు తప్పనిసరిగా మొలక శాతం చూపించి , అమ్మిన తర్వాత రైతుకు రశీదు ఇవ్వాలని తెలియజేసారు.( డీలర్లు అందరూ తప్పనిసరిగా విత్తన నియంత్రణ ఉత్తర్వు 1983 ప్రకారం క్రయ విక్రయాలు జరపాలని లేనిచో వారి మీద చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోబడునని ఆదేశించారు.

## బుచ్చి కమిషనర్ అత్యుత్సాహం

## తహశీల్దార్ కార్యాలయం దగ్గర ధర్నా

విశాలాంధ్ర- బుచ్చిరెడ్డిపాలెం: బుచ్చిరెడ్డిపాలెం కోదండరామి స్వామి దేవస్థానం వెనుకాల జగనన్న కాలనీ, వవ్వేరు గ్రామానికి పోయే కొనిలో ఉన్న ప్రదేశంలో కొంతమందికి ఇటీవల రెవెన్యూ డిపార్ట్మెంట్ వారు 9 అంకణాల చొప్పున పట్టాలు మంజూరు చేసి ఉన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ బుచ్చి కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి చెందిన ఒక రెడ్డి ఒత్తిడితో పందులవారిని నిబంధనలకు వ్యతిరేకంగా ఆ కాలనీలోని ఖాళీ స్థలాలు ప్రభుత్వం కట్టిన ఇళ్లలో బలవంతంగా చేర్పించడం వెనుక ఆంతర్యం ఏమిటని కాలనీవాసులు లబోదిబోమంటున్నారు అయితే పందుల వారిని కొంత కాలం క్రితం బుచ్చిలోనే ఒక ప్రాంతం నుంచి ఖాళీ చేసిన సందర్భాన్ని ప్రస్తావించుకోవచ్చు వీరికి బుచ్చి మండలంలోని రామచంద్రపురం లో ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని కూడా తెలుస్తుంది వీరిని అక్కడికి పంపకుండా ప్రలోభాలకు లోబడి నిబంధనలకు వ్యతిరేకంగా పందులు పెంపకం దారులను ఎక్కడ గుడిసెలు వేసుకోండి ఖాళీగా ఉన్న ఇళ్లలో చేరిపోండి అని ముక్తకంఠంతో కమిషనర్ చెప్పడం వెనుక ఆంతర్యం ఏమిటి అని కాలనీ బస్సులు ప్రశ్నిస్తున్నారు ఇదే కోణంలో మంగళపాలెంలోని గిరిజనులు రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి ఎవరిది వారు తమ ఆవేదనను బాధను తెలుపుకునే విధంగా సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టిన విషయం కూడా మనం చెప్పగానే అయితే తొలుత పందుల పెంపకం దారులను కొంతమందిని ట్రాక్టర్లలో సామాన్లు ఎక్కించి జగనన్న ఇళ్లలో చేర్పించిన ఘనత కమిషనర్ కే దక్కిందని ఆరోపణలు వినవస్తున్నాయి కాలనీవాసులు ముఖ్యంగా చెబుతున్నది ఏమిటంటే పందుల పెంపకం దారులని ఇక్కడ ఉంచితే మేము జీవనం సాగించలేము అని మొరపెట్టుకుంటున్న సందర్భంగా ప్రస్తావించుకోవచ్చు. ఇది ఇలా ఉండగా తహసిల్దార్ వెంకటేశ్వర్లు సిఐ ఎస్ఐలు సంఘటనా స్థలం చేరుకుని సమస్యను పరిష్కరించాల్సి ఉండగా ఈ పందుల పెంపకం దారుల ఇళ్లల్లో చేరే విషయం మీరు అడ్డు పడకూడదని అడ్డు రాకూడదని జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించిన విషయం కూడా ఇందులో ప్రస్తావించుకోవచ్చు బుచ్చి సీఐ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డికి దగ్గర అవడంతో అయినను బుచ్చికి సర్కిల్ ఇన్స్పెక్టర్ గా నియమించినట్లు కూడా తెలుస్తోంది. పాత్రికేయులు అసలైన అర్హులకు న్యాయం ఏ విధంగా చేస్తారో అని అడగ్గా అర్థం చేసుకోండి మీరు ఇక్కడ మాట్లాడవద్దు అని ఆయన చెప్పిన సందర్భాన్ని కూడా ప్రస్తావించుకోవచ్చు.

# సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలి

## తాసిల్దార్‌కు వినతి పత్రం అందజేసిన సిపిఐ నేతలు

విశాలాంధ్ర- జలదంకి: ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజల ఆశాజ్యోతి వరప్రదాయిని పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో జలదంకి డిప్యూటీ తహసీల్దారుకి సోమవారం ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్కే షానవాజ్ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1996 సంవత్సరం నాటి ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్టు శంకుస్థాపన చేశారని ప్రస్తుతం 80% శాతం పూర్తి అయిందని ఇంకా రెండవ టన్నెల్ 5 కిలోమీటర్లు మేర లైనింగ్ వర్క్ రిజర్వాయర్ వరకు తవ్విన కెనాల్ కు 5 కిలోమీటర్లు లైనింగ్ వర్క్ పూర్తికాని పనులకు పూర్తి చేయడానికి ఘుమారు 800 ల కోట్లు అవసరమని రిజర్వాయర్ క్రింద 11 ముంపు గ్రామాల్లో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ లబ్ధిదారు 7500 మందికి పరిష్కారించడానికి 1065 కోట్లు అవసరమవుతాయని మొత్తం మీద 2000 కోట్ల అవసరమవుతాయని అన్నారు. పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తి అయితే ప్రకాశం నెల్లూరు కడప జిల్లాలో 36 మండలల్లో 4 లక్షల 50 వేల ఎకరాలకి సాగు నీరు, 15 లక్షల మంది ప్రజలకు త్రాగు నీరు అందుతుందని నిత్యం కరువు కాటకాలతో అత్యల్ప వర్షపాతంతో కునారిల్లుతున్న ప్రాంత ప్రజలకు వరప్రదాయనిగా మారుతుందన్నారు. నారా చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు అధికారం వచ్చిన మొదటి సంవత్సరం ప్రాజెక్టు పనులు పూర్తి చేసి నీరు అందిస్తానని ప్రకాశం జిల్లా ప్రజానీకానికి హామి ఇచ్చారని, ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోని తక్షణం ప్రాజెక్టు కు 2000 కోట్ల నిధులు కేటాయించి ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమనికి సిపిఐ నాయకులు దమ్ము దర్గాబాబు, పి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తించబడిన దుకాణాలలోనే విత్తనాల కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర- రాపూరు: రాపూరు మేజర్ పంచాయతీలోని మద్దుల మడుగు సెంటర్ లో విత్తనాల వినాయక సీడ్స్‌ను ఇందుకూ రు పేట సహాయ వ్యవసాయ సం చాలకులు ఏ రాజేంద్ర కుమార్ తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా రాజేంద్ర కుమార్ రైతులు ప్రభుత్వంచే గుర్తించిన విత్తనాల షాపులోనే కొనుగోలు చేయాలని విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పక బిల్లును తీసుకోవాలన్నారు.

## ఆదర కొట్టిన చెన్నయపాలెం బుడ్డోడు!

విశాలాంధ్ర-కావలి రూరల్ : అన్నగారి పాలెం శ్రీ ముందర పొట్టెమ్మ తల్లి తిరునాలలో భాగంగా మూడో రోజు సోమవారం ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీ ముందర పొట్టెమ్మ తల్లి డ్యాన్స్ గ్రూపులో ప్రదర్శించిన డాన్స్ ప్రోగ్రాం అటు భక్తులను, ఇటు అశేష అభిమానుల్ని ఎంతగానో మంత్రముగ్ధుల్ని చేసింది. ముఖ్యంగా చెన్నయపాలెం గ్రామానికి చెందిన పొట్టి మాల్యాద్రి-కల్పన దంపతుల కుమారుడు మహితేజ కావలిలోని వివిఎస్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. డాన్స్ ప్రోగ్రాంలో భాగంగా ఆ బుడతడు డాన్స్ చేసి అదరగొట్టాడు. డ్యాన్సర్లతో పోటీ పడుతూ అలరించాడు. బుడతడు చేసిన డ్యాన్స్ అభిమానుల్ని ఎంతగానో ఆకట్టుకుంది. అక్కడ వీక్షిస్తున్న భక్తులు ఆబుడతడును ప్రశంసలతో ముంచెత్తారు.

## విడియో కాన్ఫరెన్స్‌లో మండల అధికారులతో ఎంఆర్ఓ ఎంపిడిఓ

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మండల కార్యాలయ సమావేశ హాలులో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థలో భాగంగా కలెక్టర్ విడియో కాన్ఫరెన్స్‌లో మండల తాహిసిల్దార్ పిఎల్ నరసింహమ్, మండల అభివృద్ధి అధికారి భవాని, మండల వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ భవాని తెలియజెస్తు సిద్దవరం గ్రామంలో రహదారి గురించి ఒక అర్జీ వచ్చిందని తెలియజేసారు.

## నీటి సరఫరా చేయాలని ప్రజలు ఆందోళన

విశాలాంధ్ర - కావలి : కావలి పట్టణం వైకుంటపురం 36 వ వార్డు ప్రజలు వారం రోజుల నుండి నీటి సరఫరా లేదని ఇబ్బందులు పడుతున్నామని వెంటనే నీటి సరఫరా చేయాలని సోమవారం మున్సిపల్ కార్యాలయానికి వచ్చి ఆర్వో ఇన్చార్జి కమిషనర్ ఫణి కుమార్‌కి అర్జీని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైకుంతపురం పెంకుల ఫ్యాక్టరీ రోడ్డు పక్కన సుమారు 200 కుటుంబాల పేదలం నివాసముం టున్నామని, అందరం నిత్యం కూలి పనులు చేసుకుని జీవిస్తున్నామన్నారు. మాకు వారం రోజుల నుండి నీళ్లు లేనందున పలు ఇబ్బందులు పడుతున్నామని, ట్యాంకర్ ద్వారా పోసే నీళ్ల పైనే ఆధారపడి ఉన్నామన్నారు. అది కూడా వారం నుండి రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని మా ఏరియాలో ఉన్న చేతి బోర్ కూడా చెడిపోయి ఉన్నందున నీటి కొరకు తహ తహలాడుతున్నామని, మా గోడు ఎవరు పట్టించు కోవట్లేదని ఆవేదన వెళ్లబుచ్చారు. వీరితోపాటు సిపిఎం పార్టీ నాయకులు పి. పెంచలయ్య, వై. కృష్ణమోహన్‌తో పాటు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## విత్తన దుకాణాలను తనిఖీ చేసిన వ్యవసాయ అధికారి

విశాలాంధ్ర- కావలి రూరల్ : కావలి పట్టణంలోని విత్తన దుకాణ కేంద్రాలను సోమవారం కావలి మండల వ్యవసాయ అధికారి ఎం లలిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ దుకాణాల నిర్వాహకులు వద్ద నుండి అన్ని రిజిస్టర్స్, బిల్ బుక్స్, విత్తన కొనుగోలుకు సంబంధించిన ఇన్వాయిస్‌లను తనిఖీ చేశారు. పలు రకాల వరి విత్తన రకాలు ఉండటం గమనించి సందేహం ఉన్న వరి రకాల నుండి 05 విత్తన వరి రకాల నుండి నమూనాలను సేకరించారు. ఈ విత్తన వరి రకాలను సంబంధిత రీజనల్ కోడింగ్ సెంటర్ కు నాణ్యత ప్రమాణాల పరీక్ష నిమిత్తం పంపించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఏ లలిత మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ సీజన్ మొదలు కావడంతో రైతులు వరిసాగు కోసం విత్తనాలను కొనుగోలు చేయటం జరుగుతుం దన్నారు. అటువంటి పరిస్థితుల్లో ప్రతి విత్తన దుకాణాన్ని విధిగా తనిఖీ చేయటం జరిగిందన్నారు. విత్తన దుకాణదారులు ఏటువంటి ఉల్లంఘనలకు పాల్పడిన, నకిలీ విత్తనాలను అమ్ముతున్న, సరైన బిల్లులు లేకుండా వ్యాపారం చేస్తున్న శాఖపరమైన కఠినమైన చర్యలు తీసుకుంటామని కావలి మండల వ్యవసాయ అధికారి ఏ లలిత దుకాణదారులను హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదం వ్యవసాయాధికారికి గాయాలు

విశాలాంధ్ర-జలదంకి: జలదంకి తొమ్మిదవ మైలు మధ్య కావలి దాష్ ఉదయగిరి నేషనల్ హైవే సమీపంలో ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి డైరీ వద్ద జరిగిన ప్రమాదంలో మండల వ్యవసాయ అధికారిని శైలజ తీవ్ర గాయాలపాలయ్యారు. చామదల గ్రామంలో జరిగే రైతు శిక్షణా కార్యక్రమానికి వెళుతున్న మండల వ్యవసాయాధికారి కారు ప్రమాదవ శాత్తు డైరీ గోడకు ఢీకొంది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు కాగా వ్యవసాయాధికారి తలకు గాయమైంది. కావలిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లగా, మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని వైద్యశాలకు తరలించారు.

## రెవెన్యూ సదస్సులో ఎంఆర్ఓ

విశాలాంధ్ర- రాపూరు: రాపూరు మండల తాహసిల్దార్ పి ఎల్ నరసింహమ్ ప్రత్యక్ష పర్యవేక్షణలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులో సోమవారం వీరాయ పాలెం గ్రామంలోని ఎంపిపి పాఠశాలలోజరిగిన రెవిన్యూ సదస్సులో 42 అర్జీలు వచ్చాయని అందులో పట్టాదారు పేరు సమోదు కోరకు 14 అర్జీలు, జాయింట్ ఫిల్డ్ 2 అర్జీలు, విస్తీర్ణ సవరణ 8 అర్జీలు, కోరిలే షన్ సవరణ సర్వే నెంబర్ చెంజ్ 0, జాయింట్ మ్యూటేషన్ వితర అర్జీలు18 వచ్చాయని రాపూరు మండల తాహసిల్దార్ పి.ఎల్ నరసింహం తెలియజేసారు. ఈ సదస్సులో మండల డిప్యూటీ తాహసిల్దార్ అశోక్, సర్వే ర్, విలెజ్ రెవెన్యూ అధి కారి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## టిడిపి సభ్యత్వ నమోదు ప్రారంభం

విశాలాంధ్ర- బిట్రగుంట: బోగోలు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ కన్వీనర్ మాలేపాటి నాగేశ్వర రావు, చిలకపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. మండలంలోని పలువురు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పార్టీ సభ్యత్వం పుచ్చుకున్నారు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిపాలన కావలి శాసనసభ్యుడు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి చేపడుతున్న అభివృద్ధిపట్ల ఆకర్షితులై పలువురు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ఉత్సాహం కనపరుస్తున్నారని ,మండలంలో సభ్యత్వం భారీగా పెరిగే అవకాశం ఉందని కన్వీనర్ తెలిపారు.

## సమస్యలను పరిష్కరించాలని కార్మికులు ధర్నా

విశాలాంధ్ర -కావలి :సిఐటియు రాష్ట్ర పిలుపుమేరకు అనుబంధ మున్సిపల్ కార్మికులు ఈరోజు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఏరియా ఆసుపత్రి వద్ద నుండి ప్రదర్శనగా బయలుదేరి మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని అక్కడ కొంతసేపు ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్‌కి అర్జీని ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ కార్మికులు చాలా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్ర మంలో సిఐటియు నాయకులు వై. కృష్ణమోహన్, జి. మధు సూదన్ రావు తోపాటు యూనియన్ నాయకులు తరక శీనయ్య, కె. బాబు, బిడదల మహేష్, ఎం పోలయ్య, ఒంగోలు రమేష్, పి జేమ్స్ మహిళా నాయకులు పరుసు చిన్నమ్మ, పల్లె పాటి అనిత, లక్ష్మి కాంతమ్మ తో పాటు కార్మికులు పాల్గన్నారు

## వికలాంగుల అవగాహన సదస్సు

విశాలాంధ్ర- ముత్తుకూరు: వికలాంగులకు అవగాహన సదస్సు కార్యక్ర మం సోమవారం సిఆర్సి ఆధ్వర్యంలో వికలాంగుల అవగాహన సదస్సు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగింది. కేంద్ర ప్రభుత్వ సంస్థ సిఆర్సి ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయో వృద్ధులకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో నాగమణి తెలిపారు. ఈ కార్యక్రమంలో అవయవ లోపంలో ఉన్న వారిని గుర్తించి వారికి మూడు చక్రాల బండ్లు, వినికిడి యంత్రాలు ఇతర ఉపకరణాలు వారి అర్హత మేరకు అందించుట జరుగుతుందని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో సిఆర్సి సిబ్బంది అసిస్టెంట్ ప్రొఫెసర్ బి .రాయపు రెడ్డి, ఎం. రఘు స్పెషల్ ఎడ్యుకేషన్ తదితరులు పాల్గొన్నారు.

## బోరు పరికరాల నాణ్యతను పరిశీలించిన డీఈ

విశాలాంధ్ర- బిట్రగుంట: రాబోవు వేసవి కాలాన్ని దృష్టిలోఉంచుకొని ప్రభుత్వం బోగోలు మండలానికి సరఫరా చేసిన చేతి పంపుల పరికరాల నాణ్యతను సోమవారం కావలిసబ్ డివిజన్ ,డివిజనల్ ఇంజనీర్ లీలాప్రకాష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాలకు సరఫరా అయిన వస్తువుల నాణ్యతను పరిశీలించి బిల్లులు ఆమోదించవలసి ఉందన్నారు.

# మహిళా సాధికారతే మెప్మా లక్ష్యం

విశాలాంధ్ర-నెల్లూరు కార్పొరేషన్ : మహిళా సాధికారతే లక్ష్యంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ పని చేస్తుందని నెల్లూరు కార్పొరేషన్ ఎడిసి నందన్ అన్నారు. (మెప్మా) ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించే స్టాళ్లను బారాషహీద్ దర్గా రోడ్డులో ఏర్పాటు చేశారు. ఈ స్టాళ్లను సోమవారం ఎడిసి నందన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సందర్శించి, వారిని ప్రోత్సహించాలని కోరారు. మహిళలు స్వయం ఉపాధికై వినూత్న ఆలోచనలతో తయారు చేస్తున్న వివిధ రకాల గృహ అవసరమైన ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రజలంతా వారి ఆర్థిక అభ్యున్నతికి సహకరించాలని కోరారు. స్టాళ్లలో ప్రతి ఒక్క ఇంటికీ అవసరమైన అన్ని ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని అదనపు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ టిపిఆర్ఓ బాలకృష్ణ పాల్గొన్నారు.

## శారీరక దారుఢ్యానికి, మానసిక వికాసానికి క్రీడలు అవసరం

### కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి

విశాలాంధ్ర -కావలి :శారీరక దారుఢ్యానికి, మానసిక వికాసానికి క్రీడలు అవసరమని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి అన్నారు. సోమవారం కావలి పట్టణంలోని పుల్లారెడ్డి నగర్ లో ప్రైమో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ టోర్నమెంట్లో మొత్తం 20 టీములు పాల్గొనగా ఏటీంతో ఏ టీం పోటీ పడాలో ఆయన డ్రా తీశారు. బ్యాట్ పట్టి క్రికెట్ ఆడుతూ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలలో గెలుపు, ఓటములు సహజమని, ఓడిన వారు చింతించవలసిన అవసరం లేదన్నారు. తరువాత సాధించబోయే విజయానికి ఈ ఓటమి నాంది అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తిరివీధి ప్రసాద్, దేవరకొండ శ్రీను, భోగ్యం కిషోర్ కుమార్ రెడ్డి, కేతిరెడ్డి విష్ణుతేజారెడ్డి, కావలి రూరల్ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావు, జనసేన కావలి పట్టణ అధ్యక్షులు పొబ్బా సాయి, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## నిర్దేశించిన ప్రదేశాల్లోనే బాణాసంచా విక్రయాలు జరపాలి

### - కమిషనర్ సూర్య తేజ

విశాలాంధ్ర-నెల్లూరు కార్పొరేషన్: అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నందున నెల్లూరు నగరపాలక సంస్థ నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే బాణాసంచా విక్రయాలను జరపాలని కమిషనర్ సూర్యతేజ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జన సమూహం ఉన్న ప్రదేశాల్లో బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేసి విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకొని, దుకాణాలను తొలగిస్తామని కమిషనర్ హెచ్చరించారు.

### బాణాసంచా విక్రయించే ప్రదేశాలు ఇవే

తాము సూచించిన ప్రదేశాల్లో మాత్రమే బాణాసంచా విక్రయాలు జరపాలని కమిషనర్ స్పష్టం చేశారు. వి.ఆర్.కళాశాల మైదానం, వైఎంసిఏ మైదానం, సర్వోదయ కళాశాల మైదానం, ఆర్ఎస్ఆర్. హైస్కూల్ మైదానం, ఎస్‌విజిఎస్. కళాశాల మైదానాలలో మాత్రమే బాణాసంచా విక్రయదారులు తమ దుకాణాలను ఏర్పాటు చేసుకొని విక్రయించాలని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ సూచించిన అన్ని రక్షణా చర్యలను, నిబంధనలను ఆయా దుకాణాల్లో తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ సూచించారు. అతిక్రమించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: సోమవారం కందుకూరు పట్టణంలోని శ్రీ వెంగమాంబ కళ్యాణ మండపం నందు పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కందుకూరు సబ్ డివిజన్ పోలీస్ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న రక్తదాన శిబిరాన్ని కందుకూరు శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసుల్ని గౌరవించడం మన కర్తవ్యంగా ప్రతి పౌరుడు భావించాలని ఎమ్మెల్యే కోరారు. అన్ని దానాల్లో కన్నా రక్తదానం గొప్పది అన్నారు. రక్త దానం చేయటం వలన ఆపదలో ఉన్న మరో ప్రాణాన్ని రక్షించే అవకాశం మనకు లభిస్తుందని తెలిపారు. ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు.రక్త దానం చేసేందుకు ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరిని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అభినందించారు

# ఇసుకని ఉచితంగా తీసుకెళ్ల వచ్చు: మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు :ప్రజల కోసం నెల్లూరుసిటీలో మరో నాలుగు రీచ్‌లు ప్రారంభిస్తామని, రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలతో మానటరింగ్ చేస్తామని మిషన్లు పెడితే సీజ్ చేసామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరులోని పలు ఇసుక రీచ్‌లను అధికారులతో కలిసి మంత్రి తనిఖీ చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని తీసుకువచ్చారని ప్రజలందరూ ఇసుకని ఉచితంగా తీసుకెళ్ళవచ్చని తెలిపారు. నెల్లూరు సిటీ పరిధిలోని భగత్ సింగ్ కాలనీ, బోడిగాడి తోట, గాంధీ గిరిజన కాలనీ, ధీనదయాళ్ నగర్, పొర్లుకట్ట, పొట్టేపాళెం పలు ప్రాంతాల ఇసుక రీచలను ఆయన అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి తనిఖీ చేశారు. ఇసుక రీచ్‌ల పరిస్థితిని అధికారుల్ని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రజలకి ఇసుకను అందించాలని మంత్రి అధికారుల్ని ఆదేశించారు. అనంతరం మంత్రి నారాయణే స్వయంగా ట్రాక్టర్ ఎక్కి పెన్నా నదిలోకి వెళ్లి ఇసుక రీచ్‌ల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. మరో నాలుగు రీచ్‌లను ప్రారంభించాలని ఇప్పటికే కలెక్టర్, కమిషనర్‌లకు తెలియజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ సూర్యతేజ, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్‌తో పాటు నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జడ్పీటీసీ విజేత రెడ్డి, టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు జువ్వలదిన్నె బాలిక

విశాలాంధ్ర-బిట్రగుంట: బోగోలు మండలంలోని తీరప్రాంత గ్రామమైన జువ్వలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పదవ తరగతి చదువుతున్న బాలిక కె. నీలవేణి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. శివజ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27వ తేదీనుండి 29 వరకు కడపజిల్లా రాయచోటిలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో బాలిక పాల్గొంటుందన్నారు. మారుమూల పల్లెలో, ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన బాలికను వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్ కె ఖాధర్ హుస్సేన్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు సిబ్బంది అభినందించారు.

### సౌత్ ఇండియా లెవల్ డాన్స్

## పోటీలకు ఎంపిక కావడం అభినందనీయం

విశాలాంధ్ర- కావలి: కావలి పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్ సురేంద్ర కుమార్తె గంగపట్నం లిఖిత సౌత్ ఇండియా లెవల్ కూచిపూడి డ్యాన్స్ పోటీలకు ఎంపిక అయిన సందర్భంగా సోమవారం కావలి పట్టణం తుఫాన్ నగర్లోని సంయుక్త నృత్య కళా నిలయం నందు విశ్రాంత బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ ఎం చంద్రశేఖర్, విశ్రాంత లెక్చరర్ ఎం వి ఎన్ ప్రసాద రావులు అభినందన సభ ఏర్పాటు చేసి లిఖితను సన్మానించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అక్టోబర్ 24,25,26 వ తేదీల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నందు జరిగిన స్టేట్ లెవల్ పోటీల్లో కూచిపూడి విభాగంలో మొదటి స్థానంలో నిలిచి సౌత్ ఇండియా లెవల్ పోటీలకు ఎంపికైన లిఖితను అభినందిస్తున్నామన్నారు. సౌత్ ఇండియా లెవల్ పోటీల్లో కూడా విజయం సాధించి కావలికి మరింత పేరు తీసుకొని రావాలని తెలిపారు. లిఖిత మాట్లాడుతూ గత సంవత్సరం ఇదే రోజుల్లో తనకు ఆరోగ్యం బాగలేక చెన్నై అపోలో ఆస్పత్రిలో వెంటిలేటర్ మీద చికిత్స పొందుతూ ఉన్నానని తెలిపారు. ఈ విజయానికి కారణం గత సంవత్సరం నాకు ఆరోగ్యం బాగలేని సమయంలో ఆర్థిక సహాయం అందజేసిన దాతలేనని తెలిపారు. ఆ రోజు వారు నాకు సహాయం చేయకపోతే ఈ రోజు నేను ఈ విజయాన్ని అందుకోవడానికి నేను ఉండేదాన్ని కాదేమోనని తెలిపారు. అందరూ తన విజయానికి తమ తల్లి దండ్రులు లేదా గురువులనో చెప్తారు. అలాగే తన తల్లి దండ్రులతో పాటు చిన్న నాటి నాట్య గురువు ముత్తంశెట్టి ఉమామహేశ్వరరావు తనకు ఇచ్చిన శిక్షణ వలనే నేడు ఈ స్థాయికి చేరుకున్నానని గర్వంగా చెప్పుకుంటున్నానని తెలిపారు.ఇప్పుడు నేను చదువుకున్న నాగార్జున విశ్వవిద్యాలయం నందు నాకు నృత్య శిక్షణ ఇస్తున్న నాట్య గురువు కాశీ విశ్వనాథ్ ప్రోత్సాహంతోనే నేడు ఈ పోటీలో పాల్గొని విజయం సాధించానని తెలిపారు. ఈ సందర్భంగా కాశీ విశ్వనాథ్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నానని తెలిపారు. మా ఉన్నతి కోసం కాశీ విశ్వనాథ్ ఎంతో కృషి చేస్తూ ఉన్నారని తెలిపారు.కాశీ విశ్వనాథ్ గారు మాకు గురువు కావడం మా అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు.అలాగే మా కాలేజీ డాన్స్ డిపార్ట్మెంట్ హెచ్.ఓడీ. వరప్రసాద్ మూర్తి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు.

## బాణాసంచా దుకాణాలపై స్పెషల్ డ్రైవ్: ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు :జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బంది కలసి దుకాణాలలో అనుమతిలేని బాణాసంచా నిల్వలు విక్రయాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు. నిర్వాహకులు ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలు, జాగ్రత్తలు తప్పక పాటించాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ఇతర ప్రదేశాలలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. జనావాసాలకు, విద్యాసంస్థలకు, హాస్పటల్స్ కు, ప్రజల నివాస ప్రాంతాలలో టపాకాయలు విక్రయించరాదన్నారు. పట్టణ, మండల సుదూర ప్రాంతాలలో మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాణాసంచా అక్రమ విక్రయాలు, నిల్వల సమాచారాన్ని గానీ, ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, సహాయం అవసరమైనా, అత్యవసర సమయంలో ఫైర్ స్టేషన్ కు 101,డయల్ 112 లకు తెలియజేయలని సూచించారు.

## ఉయ్యాలోని బిడ్డ అపహరణ

విశాలాంధ్ర- కావలి: కావలి పట్టణంలోని వెంగళరావు నగర్ లో నివాసముంటున్న పల్లపు రాజేశ్వరి తన సంవత్సరం మూడు నెలల బాబు తేజ ను ఉయ్యాల్లో ఉంచి స్నానానికి వెళ్ళింది. స్నానం అనంతరం బయటకొచ్చి చూడగా ఉయ్యాలో ఉన్న బాబు కనిపించలేదు. చుట్టుపక్కల చూడగా ఎక్కడ బాబు ఆచూకీ కనిపించలేదు. కంగారు పడిన ఆమె టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. టూ టౌన్ సీఐ కొండవీటి శ్రీనివాసులు సిబ్బందితో ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. చుట్టుపక్కల వారిని విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్ చేస్తున్నారు. బాబు ఆచూకీ తెలిస్తే టూ టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు.

## పోలీసుల అదుపులో వైకాపా నేత

విశాలాంధ్ర- మనుబోలు: మనుబోలు మండలం కొమ్మలపూడి గ్రామ వైకాపా నేత చెందులూరు శ్రీనివాసులు మనుబోలు పోలీసులు సోమవారం తెల్లవారుజామున అదుపులో తీసుకున్నారు. ఈ విషయమై పత్రిక విలేకరులు ఎస్సైని వివరణ కోరడంతో సదరు నేతకు 41 నోటీసు జారీ చేసి ఉన్నామని ప్రభుత్వ భూముల అవకతవకలపై ఫిర్యాదులు రావడంతో సదరు నేతను అదుపులో తీసుకున్నామని విచారణ త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. వైకాపా నేతను తెల్లవారుజామున పోలీసులు అదుపులో తీసుకోవడంతో స్థానికంగా ఉన్న వైకాపా నాయకులు పెద్ద ఎత్తున మనుబోలు పోలీస్ స్టేషన్ వద్దకు తరలి రావడం విశేషం. అంతేకాకుండా తమ నేతను అన్యాయంగా పోలీస్ స్టేషన్ కు తరలించారని ఆరోపణలు చేశారు.